కెజిబివిల్లో బదిలీలు చేపట్టాలి

ప్రజాశక్తి-సాలూరురూరల్

కెజిబివి ఒప్పంద ఉద్యోగుల బదిలీలను ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు వెంటనే చేపట్టాలని కెజిబివి ఒప్పంద ఉద్యోగుల సంఘం నాయకులు గణేష్, శంకర్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు డిమాండ్ చేశారు. శనివారం సాలూరులోని సిఐటియు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభించి ఇన్ని రోజులు గడుస్తున్నా నేటి వరకు ఈ బదిలీలపై ఉత్తర్వులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. దీనివల్ల బదిలీల్లో స్థానం కోరుకున్న వారు.. తమ పిల్లలను ఎక్కడ చదివించాలో అయోమయంలో ఉన్నారని చెప్పారు. గత నెల 24న జరిగిన రిక్వెస్ట్ బదిలీ కౌన్సిలింగ్‌కు సంబంధించి వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

చెరకు రైతులకు చేదు కబురు

- పెట్టుబడితో సంబంధం లేకుండా రూ.10 పెంపు
- గొప్పగా చెప్పకుంటున్న కేంద్రం
- చెరకు పాలసీని పునరుద్ధరించని రాష్ట్ర ప్రభుత్వం

చెరకు రైతులకు మరోసారి చేదు అనుభవం ఎదురైంది. ఇప్పటికే సహకార రంగంలోని చక్కెర కర్మాగారాలను రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా మూసివేసివేస్తుండగా, కేంద్ర ప్రభుత్వం ఉత్పాదక వ్యయంతో సంబంధం లేకుండా క్వింటా చెరకుపై రూ.10 పెంచి, దాన్నే గొప్పగా చెప్పేసుకుంటోంది. దీంతో, చెరకు రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో మరోసారి మోసపోయినట్లైంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్రంలో ఒకప్పుడు 5లక్షల ఎకరాల విస్తీర్ణంలో చెరకు సాగయ్యేది. సుమారు 29 సుగర్ ఫ్యాక్టరీల్లో క్రషింగ్ చేసేవారు. చెరకు సాగుకయ్యే పెట్టుబడులతో సంబంధం లేకుండా కేంద్రంలోని పాలకులు మద్ధతుధర నిర్ణయించడం, 2002లో అప్పటి సిఎం చంద్రబాబు చెరకు పాలసీని రూపొందించే స్టేట్ అడ్వైజరీ కమిటీని రద్దుచేయడం వంటి కారణాల వల్ల రైతులకు ఆర్థికంగా కుదేలవుతూవచ్చారు. దీంతో, క్రమంగా ప్రస్తుతం చెరకు విస్తీర్ణం క్రమంగా 1.50లక్షల ఎకరాలకు తగ్గింది. సామర్థ్యానికి అనుగుణంగా చెరకు ఉత్పత్తులు లేకపోవడంతో చాలా వరకు చెక్కెర కర్మాగారాలు మర్మతులకు గురయ్యాయి. ఆధునీకరణ పేరుతో విజయనగరం జిల్లాలోని భీమసింగి విజయరామగజపతి సహకార చెక్కెర కర్మాగారం సహా పలు కర్మాగారాలను ప్రభుత్వాలే మూసివేశాయి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా విజయనగరం జిల్లా సంకిలి సహా నాలుగు కర్మాగారాల్లో మాత్రమే చెరకు క్రషింగ్ జరుగుతోంది.

ఈ సంగతి కాస్త అటుంచితే.... పెరిగిన పెట్టుబడుల ఆధారంగా క్వింటా చెరకుకు రూ.10చొప్పున మద్ధతు ధర కల్పించనున్నట్టు కేంద్ర మంత్రులు మన్‌సుఖ్ మాండవ్యా, అనురాగ్‌సింగ్ ఠాగూర్ ఇటీవల ప్రకటించిన విషయం విధితమే. ఇందులో హేతుబద్ధత లేదని రైతులు, ఎపి రైతు సంఘం, చెరకు రైతుల సంఘం నాయకులు చెబుతున్నారు. మంత్రుల ప్రకటన ప్రకారం 2023-24 టన్ను క్రషింగ్ సీజన్‌లో టన్ను చెరకు రూ.3150 చొప్పున కొనుగోలు చేస్తారు. వాస్తవానికి ఇంతకు మించి రైతులకు పెట్టుబడులు అవుతున్నాయి. ఈ ధర నిర్ణయించే సమావేశంలోనే యూరియాపై రూ.24, పొటాష్, డిఎపి బస్తాలపై రూ.50చొప్పున పెంచేందుకు కేంద్ర క్యాబినెట్ నిర్ణయం చేసింది. పెరిగిన డీజిల్ ధర వల్ల ట్రాక్టర్ అద్దె గతంతో పోలిస్తే రూ.200 పెరిగింది. కూలి రేట్లు కూడా అమాంతంగా పెరిగిపోయాయి. ఈ లెక్కన ప్రాంతాలు, నీటి వసతులను బట్టి దుక్కి, విత్తనం, గొప్పులు, ఎరువులు, బోదులు కట్టడం, నీరుపెట్టడం, కూలి తదితర రూపాల్లో ఎకరాకు రూ.30వేల నుంచి రూ.60వేల వరకు పెట్టుబడి అవుతుంది. మరోవైపు రవాణా ఛార్జీలు కూడా గతంలో పోలిస్తే బాగా పెరిగిపోయాయి. వ్యవసాయ రుణాలపై ఆర్‌బిఐ 5శాతం వడ్డీ రేట్లు పెంచింది. ఈనేపథ్యంలో స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం సి2 ప్లస్ 50శాతం ఫార్ములా ప్రకారం చెరకు సాగుకు అయ్యే మదుపు లెక్కించి దానిపై 50శాతం పెంచి ధర నిర్ణయం చేయాల్సివుంది. ఎన్నికలకు ముందు ప్రధాన నరేంద్రమోడీ కూడా ఇదే పద్ధతిలో మద్ధతు ధర చెల్లిస్తామని ప్రకటన చేశారు. ఈలెక్కన టన్ను చెరకుకు రూ.5వేల చొప్పున చెల్లించాల్సి వుందని ఎపి రైతు సంఘం డిమాండ్ చేస్తోంది. కేంద్రం దీన్ని అమలు చేయలేదు సరికదా మద్ధతు ధర నిర్ణయించడానికి ప్రాతిపదికగావున్న రికవరీ శాతాన్ని 9.5 నుంచి 10.5శాతానికి పెంచింది.

మన రాష్ట్రంలో చెరకు పరిశోధనలు ఏళ్ల తరబడి ముందుకు సాగడం లేదు. ఫలితంగా కొత్త రకం విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో ఇప్పటికీ 10ఏళ్ల నాటి విత్తనాలనే ఉపయోగించడం వల్ల దిగుబడి దిగుబడి ఎకరాకు 20టన్నుల నుంచి అత్యధికంగా 40టన్నులకు మించి రావడం లేదు. రికవరీ రేటు కూడా మన రాష్ట్రంలో 9.5శాతానికి మించి రావడం లేదు. దీంతో, చెరకు రైతులు ధర విషయంలో తీవ్రంగా నష్టపోతున్నారు. క్వింటాకు రూ.10 పెంపు అనేది ఏటా పెంచుతున్నదేనని, దానికి ఎలాంటి కొలబద్దా లేదని రైతు సంఘం నాయకులు చెబుతున్నారు.

మా ప్రభుత్వం రైతు పక్షపాతి

పంటల బీమా అందజేసిన డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి-సాలూరు

రాష్ట్రంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వం కొనసాగుతోందని డిప్యూటీ సిఎం రాజన్నదొర చెప్పారు. తమది రైతు పక్షపాతి ప్రభుత్వమన్నారు. శనివారం వైఎస్ఆర్ రైతు దినోత్సవం సందర్భంగా ఎఎంసి గోడౌన్‌లో జిల్లా వ్యాప్తంగా రైతులకు పంటల బీమా కింద మంజూరైన 6.59 కోట్ల రూపాయల చెక్కును అందజేశారు. జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజన్నదొర మాట్లాడుతూ దేశంలో రైతులకు ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని చెప్పారు. నకిలీ విత్తనాలు, ఎరువుల బెడద లేకుండా నియోజకవర్గ స్థాయిలో అగ్రిల్యాబ్‌లను ప్రారంభించిన ఘనత సిఎం జగన్‌దేనని చెప్పారు. టిడిపి హయాంలో మూడేళ్లకోసారి పంటల బీమా అందజేసినట్లు చెప్పారు. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో రైతులకు 3,400 కోట్ల లబ్ధి చేకూరిస్తే, వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లలో 7,800కోట్ల లబ్ధి చేకూర్చిందన్నారు. ఈ సందర్భంగా ఎఎంసి యార్డులో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌ని ఆయన ప్రారంభించారు. ఎస్‌టి కమిషన్ చైర్మన్‌గా నియమితులైన డివిజి శంకరరావును ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం అభినందిస్తూ శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో జెసి గోవిందరావు, మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, ఎఎంసి చైర్ పర్సన్ దండి అనంతకుమారి, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పార్వతీపురం మార్కెట్ యార్డ్ వద్ద రూ.68.4 లక్షలు నాబార్డు, ఆర్‌కెవివై నిధులతో నిర్మించిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ మరడాన భాగ్యశ్రీ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, జెడ్‌పిటిసి సభ్యులు బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు పాల్గొన్నారు.

పంటల బీమా చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

పాలకొండ రూరల్ : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో రూ.59 లక్షలతో నిర్మించిన అగ్రిల్యాబ్‌ను ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మాళి భాను, నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి పాల్గొన్నారు.

కురుపాం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతు పక్షపాతని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. కురుపాంలో ఎఎంసి యార్డులో వద్ద రూ.92 లక్షలతో నిర్మించిన అగ్రికల్చర్ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలకు వచ్చే తెగుళ్లపై పరిశోధన చేసి వాటి అనుకూలంగా ఎరువులు, పురుగుల మందులు వాడేందుకు నియోజకవర్గానికి ఒకటి అగ్రికల్చర్ ల్యాబ్‌ను నిర్మించి సిఎం జగన్ రైతుల పక్షపాతి అయ్యారని కొనియాడారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి నిర్మల జ్యోతి, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయ చంద్రశేఖర్, సర్పంచ్ జి.సుజాత, వైస్ సర్పంచ్ షేక్ ఆదిల్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, మాజీ ఎంపిపి ఐ.ఇంద్రకుమారి, ఎఎంసి మాజీ చైర్మన్ ఎన్.వెంకటరావు, ఎంపిటిసిలు వి.బంగారనాయుడు, టివిఎస్ స్వామియోజులు, మైనార్టీ నాయకులు షేక్ నూరేళ్ల పాల్గొన్నారు.

కురుపాం.. అగ్రిల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గొట్టివలస గ్రామ సమీపంలో ఉన్న ఏనుగులు

గొట్టివలస పరిసరాల్లో ఏనుగుల తిష్ట

ప్రజాశక్తి-గరుగుబిల్లి

కొమరాడ, జియమ్మవలస మండలాల నుంచి తరలివచ్చిన ఏనుగుల గుంపు మూడు రోజుల నుంచి గొట్టివలస పరిసర ప్రాంతాల్లో తిష్టవేసింది. గురువారం అర్ధరాత్రి గ్రామంలో హల్‌చల్ చేశాయి. పశువుల శాలలు, నాటుబళ్లు, తౌడు బస్తాలను ధ్వంసం చేశాయి. శుక్రవారం రాత్రి గొట్టాపు సూర్యనారాయణకు చెందిన ట్రాక్టర్ తొట్టిని ధ్వంసం చేశాయి. దీంతో గ్రామస్తులు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం పార్వతీపురం గరుగుబిల్లి ఆర్అండ్‌బి ప్రధాన రహదారి పరిధిలోని మామిడి తోటల్లో ఏనుగులు సంచరిస్తుండడంతో బిక్కుబిక్కుమంటూ వాహన చోదకులు ప్రయాణం చేస్తున్నారు. పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు భయాందోళన చెందుతున్నారు.

చంద్రబాబు హామీలు నీటిమూటలే

వైఎస్ఆర్ జయంతి కార్యక్రమంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలు నీటి మూటలేనని డిప్యూటీ సిఎం రాజన్నదొర వ్యాఖ్యానించారు. శనివారం వైఎస్ఆర్ జయంతి సందర్భంగా బోసుబొమ్మ జంక్షన్‌లో ఆయన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన స్వర్ణయుగమని అన్నారు. ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదల గుండెల్లో నిలిచిపోయాయని చెప్పారు. ఆయన బాటలోనే సిఎం జగన్ మోహన్ రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని తెలిపారు. నవరత్నాలనే పథకాల ద్వారా నేరుగా పేదలకు లబ్ధి చేకూరుస్తున్నారని చెప్పారు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి కల్లబొల్లి హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ చేస్తామని హామీనిచ్చి దగా చేసిందన్నారు. అలాంటి చంద్రబాబు నాయుడు ఇప్పుడు కొత్త కొత్త హామీలతో ప్రజల్ని మభ్యపెట్టడానికి ప్రజల్లోకి వస్తున్నారని చెప్పారు. మహిళలందరికీ ఏడాది 20వేల రూపాయలు చొప్పున పంపిణీ చేస్తానని చెపుతున్న చంద్రబాబు హామీ ఆచరణ సాధ్యం కాదని చెప్పారు. ఐదేళ్లలో మహిళలకు 14 వేల కోట్లు, రైతులకు 87 వేల కోట్లు రుణమాఫీ చేయలేని చంద్రబాబు ఏటా లక్షల కోట్ల రూపాయలు పంచుతామంటే నమ్మే స్థితిలో ప్రజలు లేరని అన్నారు. టిడిపి నాయకులు బస్సుయాత్ర పేరుతో పట్టణానికి వచ్చి కల్లబొల్లి కబుర్లు చెపుతారని, నమ్మి మోసపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరి రఘు, గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, రాపాక మాధవరావు, పట్టణ మాజీ అధ్యక్షుడు జర్జాపు సూరిబాబు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ, ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వినతి అందజేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

ఆశ్రమ పాఠశాలల్లో వైద్య సిబ్బంది నియమించాలి

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో వైద్య సిబ్బందిని తిరిగి నియమించాలని గిరిజన సంఘాల నాయకులు శనివారం డిప్యూటీ సిఎం రాజన్నదొరని కోరారు. డిప్యూటీ సిఎం రాజన్నదొరని ఆయన నివాసంలో వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో సిఆర్‌టిలను నియమించాలని కోరారు. దినసరి వేతనదారులను రెగ్యులర్ చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు దుక్క సీతారాం, పల్లా సురేష్, ఆర్ధిక చంద్రశేఖర్, సంగంరెడ్డి జయసింహ, కోలక గౌరమ్మ ఉన్నారు.

రేపు సీతానగరం మండలానికి బస్సుయాత్ర

ప్రజాశక్తి-సీతానగరం

భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న టిడిపి బస్సుయాత్ర సోమవారం మండలానికి చేరుతుందని ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు, వేణుగోపాల్‌నాయుడు తెలిపారు. శనివారం టిడిపి నాయకులు సాల హరిగోపాలరావు నివాసం వద్ద మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌సిఎస్ చక్కెర పరిశ్రమ, సువర్ణముఖి నదిపై అసంపూర్తి వంతెనను బస్సుయాత్ర బృందం పరిశీలిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచ్ జొన్నాడ తెరీజమ్మ, మాజీ ఎంపిటిసి సబ్బాను శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బి.శ్రీనివాసరావు, వాకాడ పారినాయుడు, బొత్స వెంకటనాయుడు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల రాస్తారోకో

ప్రజాశక్తి-సీతానగరం

వేతన బకాయిలను వెంటనే చెల్లించి గ్రీన్ అంబాసిడర్లను ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం హనుమాన్ జంక్షన్‌లో గ్రీన్‌అంబాసిడర్లు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 నెలలుగా వేతనాలు లేక గ్రీన్‌అంబాసిడర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రామభద్రపురం మండలం ఆరికతోట గ్రామానికి చెందిన మావిడి త్రినాథరావు జీతాలు అందక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని చెప్పారు. మెరుగైన వైద్యం అందించి, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గౌరీ, అప్పలనాయుడు, సూరి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఎపి బయోడైవర్సిటీ బోర్డు, ఐఆర్‌పిడబ్ల్యూ సంస్థ ఆధ్వర్యాన శనివారం నరిసిపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో పండ్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అవరణలో నాటే మొక్కలను బతికించే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రామంలోని వాలంటీర్లు, మధ్యాహ్న భోజన కార్మికులకు ఎమ్మెల్యే మొక్కలను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో వైఎస్ఆర్ విగ్రహానికి సర్పంచ్ బంగారమ్మతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్ నగరంలో ఎంపిటిసి బడేరామారావు, తాళ్లబురిడిలో జడ్‌పిటిసి బలగరేవతమ్మ, నాగేశ్వరరావు దంపతులు, బస్టాండ్ వద్ద ఎంపిటిసి లక్ష్మితో కలిసి ఎమ్మెల్యే పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బయోడైవర్సిటీ బోర్డు రీజనల్ కోఆర్డినేటర్, విశ్రాంత డిఎఫ్ఒ జానకీరావు, ఐఆర్‌పిడబ్ల్యూ డైరెక్టర్ పికె ప్రకాశ్, బయోడైవర్సిటీ సలహాదారులు పట్నాయక్, జానీ, దయ, గణేష్, వెంకటేష్, వైసిపి నాయకులు కాపారపు సత్యనారాయణ, గుర్రాజు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

నాగావళిలో పెరిగిన నీటి ప్రవాహం

వంగర : మండలంలోని నాగావళి నదిలో శనివారం నీటి ప్రవాహం పెరిగింది. ఎగువున ఉన్న ఒరిస్సాలో వర్షాలు కురవడంతో మన్యం జిల్లా గరుగుబిల్లి మండలంలో గల తోటపల్లి ప్రాజెక్టులోకి నీరు ఎక్కువగా చేరడంతో అప్రమత్తమైన అధికారులు కొన్ని గేట్లు ఎత్తి నీటిని విడిచి పెట్టారు. దీంతో నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. అయితే ఇంతవరకు నీటి ప్రవాహం చాలా తక్కువగా ఉండటంతో నాగావళి నదికి ఇవతల విజయనగరం జిల్లాలో గల కొన్ని మండలాలు ప్రజలు, నదికి అవతల వైపున ఉన్న మన్యం జిల్లాలో గల కొన్ని మండలాల ప్రజలు వంగర మండలంలోని శివ్వాం, ఒని అగ్రహారం, తలగాం రేవులు వద్ద రాకపోకలు సాగించేవారు. నీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

అభివృద్ధికి సాధనం.. ఎన్ఇపి

సిటియు విసి కట్టమణి

విజయనగరం టౌన్ : జాతీయ విద్యా విధానం దేశ అభివృద్ధికి సాధనమని గిరిజన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ తేజస్వి కట్టమని అన్నారు. శనివారం గిరిజన విశ్వ విద్యాలయం లో జరిగిన ఎన్ఇపి 2020పై ఆయన మాట్లాడారు. విద్యా వ్యవస్థను గాడిలో పెట్ట దానికి, మాతృభాష వినియోగం పెంచేందుకు , విద్యార్థులను ప్రయోజకులను చెయ్యడానికి జాతీయ విద్యా విధానం ఉపయోగ పడుతుందని అన్నారు. విశ్వ విద్యాలయ భూమి అప్పగింత జరిగిందని, త్వరలోనే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, కేంద్ర విద్యా వ్యవహారాల మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ల చేతులమీదుగా శంకుస్థాపన జరుగుతుందని తెలిపారు. అనంతరం ఫోర్ట్ సిటీ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రహనేఖాన్ మాట్లాడారు.

ఉనికి కోసం ఒకరు... ఉలికిపాటుతో మరొకరు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ప్రతిపక్షం ఉనికి కోసం పాకులాడుతుండగా.... ఆ చర్యలకు అధికార పక్షం ఉలికిపాటుకు గురౌతోంది. తాజా పరిణామాలను ఇందుకు భేరీజు వేస్తున్నారు జనం. భవిష్యత్తు గ్యారెంటీ పేరిట టిడిపి రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన బస్సు యాత్ర నియోజకవర్గాలవారీగా సాగుతున్న విషయం విధితమే. ఈనెల 4వ తేదీన జిల్లాకు చేరిన బస్సులో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయ కర్త బుద్దా వెంకటన్న నాయకత్వంలో విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన నాయకులు యాత్రచేపట్టిన విషయం విధితమే. ముఖ్యంగా విజయనగరంలో చేపట్టిన బస్సుయాత్ర ముమ్మాటికీ ఉనికి కోసమేనని పబ్లిక్ టాక్. బస్సుయాత్రలో సందర్శించిన స్థలాలు, సమస్యలతోపాటు భవిష్యత్తు గ్యారెంటీ అన్న అంశంపైనా జనం విమర్శనస్త్రాలు సంధిస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. టిడిపి ప్రతిపక్షంలోకి వచ్చి నాలుగేళ్లు దాటింది. వైసిపి చెప్పిన మద్యపాన నిషేధం అమలు చేయలేదు సరికదా.. ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. వీటిపై అడపాదడపా ప్రెస్‌మీట్లలోనో లేక ఆడియో క్లిప్పింగుల్లోనూ తప్ప గట్టిపోరాటం చేసిన దాఖలాలు లేవు. కానీ, కెఎల్‌పురంలో వున్న సర్కారువారి మద్యం దుకాణాన్ని ఊరు అవతలకు మార్చడాన్ని తప్పుపడుతూ హడావుడి చేయడం పట్ల చాలా మంది నవ్వుతున్నారు. మరీ ముఖ్యంగా సోనియానగర్, సారిపల్లిలో టిడ్కో ఇళ్ల నిర్మాణం తమ హయాంలోనే 80శాతం పూర్తిచేశామని టిడిపి నాయకులు చెబుతున్నారు. కొన్నాళ్ల క్రితం వరకు తామే నిర్మాణ పనులు పూర్తిచేశామని కూడా చెప్పారు. ఆ మాటకొస్తే లబ్ధిదారులకు కేటాయింపులు కూడా చేశారు. ఆ తరువాత ఇళ్లు అప్పగించకపోవడంతో గడిచిన ఎన్నికల్లో లబ్ధిదారులు టిడిపిని ఇంటికి పంపారు. విజయనగరంలో టిడిపి ఓటమికి ఇది కూడా ఒక కారణమని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. అవకాశం ఉన్నప్పుడు ప్రజలకు అప్పజెప్పేందుకు ముందుకు రాని టిడిపి, రానున్న ఎన్నికల కోసం రాజకీయాలు చేస్తుందని పలువురి విమర్శ. గురజాడ అప్పారావు స్వగృహాన్ని సాహితీ కేంద్రంగా అభివృద్ధిచేయాలని చాలా కాలంగా కవులు, రచయితలు, సాహితీ ప్రియులు, పట్టణ పుర ప్రముఖులు కోరుతున్న

విషయం విధితమే. అధికారంలో ఉన్నన్నాళ్లూ పెడచెవిన పెట్టి తాజాగా బస్సుయాత్రలో గురజాడపై భక్తిని ప్రదర్శించారు. ఇక పెద్దచెరువుతోపాటు విజయనగరం కోట అభివృద్ధికి టిడిపి హయాంలో రూ.కోట్లు మంజూరయ్యాయి. దుర్వినియోగమైనట్టు విమర్శలు కూడా వినిపించాయి. వాటి అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ కీలకమైన అభివృద్ధి పనులను పూర్తిచేయడంలో టిడిపి విఫలమైంది. అధికారంలోకి వచ్చాకైనా వాటికోసం ప్రభుత్వాన్ని నిలదీయలేదు. దీంతో, ప్రస్తుతం చేపడుతున్న భరోసా గ్యారెంటీ పేరిట చేపట్టిన బస్సు రథయాత్ర కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమేనని ప్రజలు చర్చించుకుంటున్నారు. చిత్తశుద్ధి ఉంటే గడిచిన నాలుగేళ్లలో ఎందుకు ప్రశ్నించడం లేదని పలువురువ వాదిస్తున్నారు.

ఇక వైసిపి పరిస్థితికి వస్తే టిడిపి చేపట్టిన బస్సుయాత్రకు ఉలికిపాటుకు గురికావడం తప్ప, వారు అడుగుతున్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు చెప్పలేకపోతోంది. ముఖ్యంగా టిడ్కో ఇళ్లు ఇవిగో అవుగో అంటూనే నాలుగేళ్లు గడిపేశారు. ఈ నేపథ్యంలో టిడిపికి, వైసిపికి తేడా ఏమిటని జనం ప్రశ్నిస్తున్నారు. లబ్ధిదారులకు నాడు చంద్రబాబు ఇచ్చిన పత్రాలను రద్దుచేసి, వాటి స్థానంలో జగన్మోహన్‌రెడ్డి బొమ్మతో కూడిన పత్రాలు ఇవ్వడం తప్ప ఇళ్లు అప్పగించిన పాపాన పోలేదన్న ఆవేదన వ్యక్తమౌతోంది. టిడిపిపై స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల ఎదురుదాడి చేసే బదులు పెద్దచెరువును, అక్కడ తలపెట్టిన ట్రీట్‌మెంట్ ప్లాంటును ఎందుకు అభివృద్ధి చేయలేకపోయారో చెబితే బాగుంటుందని చాలా మంది చర్చించుకుంటున్నారు. టిడిపి నాయకులు చేసిన ఆరోపణలకు తగ్గట్టే జెఎన్‌టియు కొండపై అప్పట్లో టిడిపి ప్రభుత్వం ఏర్పాటుచేసిన సోలార్ పవర్ ప్లాంట్‌ను గాలికి వదిలేసింది. నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రజాధనం నిరుపయోగం కావడంతోపాటు విద్యుత్ అవసరాలను తీర్చుకోలేని దుస్థితి ఏర్పడింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత డ్రిప్ ఇరిగేషన్ కూడా పట్టించుకోలేదు. వీటిపై ఎమ్మెల్యే సమాధానం చెప్పడానికి బదులు ఉనికి కోసమే ఇదంతా చేస్తున్నారని బుకాయించడం ప్రజలు గమనిస్తున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు కేవలం ఉనికి చాటుకోవడానికి, ఉలికిపడి కాకుండా ప్రజలకు చిత్తశుద్ధితో సేవలందిస్తే ప్రజలు గుర్తిస్తారని పలువురు హితవు పలుకుతున్నారు.

దుకాణాలకు నోటీసులు

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో జెసి ఆదేశాల మేరకు షాపులకు శనివారం ఉప తహశీల్దార్ ఎం.మధుసూదన్‌రావు నోటీసులు జారీ చేశారు. నిత్యావసర సరుకులు ఎంఆర్‌పి ధరలకు విక్రయించాలని అందులో పేర్కొన్నారు. ఎంఆర్‌పి కంటే అదనంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకురాలు భూదేవి

సమరానికి సిద్ధంగా ఉండండి : టిడిపి

ప్రజాశక్తి-సీతంపేట

ఎన్నికలు ఏ క్షణమైనా రావచ్చుని, సమరానికి సిద్ధంగా ఉండాలని టిడిపి నియోజకవర్గ నాయకురాలు పడాల భూదేవి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం సీతంపేటలోని తన క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధినేత చంద్రబాబు నాయుడు సూచనల మేరకు పార్టీని పటిష్ట పరిచేందుకు సమిష్టి కృషి అవసరమన్నారు. ప్రలోభాలకు తలొగ్గకుండా ముందుకు సాగాలన్నారు. వాస్తవాలు కొద్ది రోజులే దాయగలరని, ఆ తర్వాత వాటంతట అవే బయటపడతాయని అన్నారు. వైసిపి పాలన ఎలా సాగుతుందో అందరికీ తెలిసిందేనన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

బిసి కాలనీలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని బిసి కాలనీలో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి గర్భిణులు, జ్వర పీడితులు, రక్తపోటు, మధుమేహ, రక్తహీనత తదితరమైన వ్యాధులకు తనిఖీలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతికుమారి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డివిజికి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌గా నియమితులైన డివిజి శంకరరావుకు అభినందనలు వెల్లువెత్తాయి. పెదపదం మాజీ సర్పంచ్ మత్స విజయభాస్కర రావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి చొక్కాపు త్రినాథరావు ఆయనకు అభినందనలు తెలిపారు.

కిశోర బాలికలకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

పట్టణంలోని నాలుగో వార్డు పరిధిలోని నీలమ్మ కాలనీ అంగనవాడీ కేంద్రంలో కిశోర బాలికలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3 కిలోల బియ్యం, కందిపప్పు, నూనె వంటి కిట్లను కౌన్సిలర్ గంగునాయుడు, టి.లక్ష్మణ్, పి.బాను, డి.పాపినాయుడు, కె.అరుణ్ సమక్షంలో శనివారం పంపిణీ చేశారు.

కేకు కట్ చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

ఘనంగా జగదీశ్వరి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి జన్మదిన వేడుకలను శనివారం గుమ్మలక్ష్మీపురంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆమె కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఐదు మండలాలకు చెందిన టిడిపి నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, తెలుగు యువత అధ్యక్షులు కోలా రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్‌కు శరణ్య

ప్రజాశక్తి-భోగాపురం

విమానాశ్రయం నిర్వాసిత గ్రామమైన బొల్లింకల పాలెంకు చెందిన బొల్లెంకుల కార్తీక శరణ్య అంతర్జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైంది. ఆగస్టు18 నుండి 22 వరకు ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్‌లో జరుగు పోటీలలో శరణ్య పాల్గొంటారు. ఇటీవల చండీగఢ్ మొహాలీలో జరిగిన సెలక్షన్‌లో పాల్గొని అంతర్జాతీయ పోటీలో చోటు దక్కించుకుంది. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో 30 పతకాలు సాధించింది. మండలంలోని పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం కోచ్‌లు సత్యనారాయణ, చిట్టిబాబు దగ్గర శిక్షణ పొందుతుందని తల్లి దండ్రులు అప్పన్నరెడ్డి, రత్న కుమారి తెలిపారు. శరణ్యకు స్కేటింగ్ పట్ల ఉన్నా ఆసక్తిని గుర్తించి తర్ఫీదునిచ్చామన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

గంట్యాడ : రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని మండల టిడిపి అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన మండల పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలోని టిడిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి ప్రతి ఒక్కరూ ప్రజల వద్దకు వెళ్లి వివరించాలన్నారు. ప్రతి గ్రామంలోని ఓట్లు చేర్పులు మార్పులు గురించి తెలుసుకోవాలన్నారు. సంబంధిత బిఎల్‌ఒలను కలిసి ఓటరు జాబితా గురించి వివరాలు అడిగి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ అరాచక పాలన గురించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు బడుగు బలహీన వర్గాల మహిళలకు అందించిన పథకాలు గురించి వివరించాలన్నారు. రానున్న ఎన్నికలలో టిడిపిని గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ కార్యదర్శి అల్లు విజయకుమార్, సీనియర్ నాయకులు రొంగళి కృష్ణ, బూడి అప్పలనాయుడు, రండి చినరామనాయుడు, సతీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన ప్రభుత్వ ఉపాధ్యాయుల శిక్షణ

డెంకాడ: స్థానిక ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గత వారం రోజులుగా నిర్వహించిన ప్రభుత్వ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఎపిఎస్‌సిహెచ్‌ఇ, ఎపి డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా వారం రోజులు పాటు డిజిటల్ ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్‌లో భాగంగా 1200 ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌లు, ఆండ్రాయిడ్ బాక్స్‌పై బైజూ కంటెంట్‌తో శిక్షణ ఇచ్చారు. ఎంవిజిఆర్‌లో వివిధ విభాగాల నుండి మొత్తం 19 మంది అధ్యాపకులో ఈశిక్షణలో పాల్గొని ఉపాధ్యాయులకు డిజిటల్ శిక్షణ ఇచ్చారు. తరగతి గది బోధనా అభ్యాస ప్రక్రియలో డిజిటల్ సాధనాల ప్రాముఖ్యతను వివరించారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

మెరకముడిదాం : గత టిడిపి ప్రభుత్వంలో మెరక ముడిదాం మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు పై బహిరంగ చర్చకు మండల టిడిపి నాయకులు సిద్ధంగా ఉన్నామని, వైసిపి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పై చర్చించకు మీరు సిద్ధామా అని టిడిపి మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు అన్నారు. మండల కేంద్రంలో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. టిడిపి హయాంలో మండలంలో ఇళ్లు,, గర్భాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సిసి రోడ్లు, కాలువలు, పాఠశాలల ప్రహరీ గోడలు, తదితర అభివృద్ధి చేశామన్నారు. మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పగలరా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఎం. రమణ మోహనరావు, కె. ధనంజయ, టి.శ్రీధర్, పాల్గొన్నారు.

బలహీన వర్గాల గుండెచప్పుడు వైఎస్ఆర్

రాజశేఖర్‌రెడ్డి జయంతి సభలో డిప్యూటీ సిఎం రాజన్నదొర, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

బలహీన వర్గాల గుండె చప్పుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అన్నారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో పార్వతీపురం ఆర్‌టిసి కూడలి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని శనివారం పునప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల కళ్లల్లో ఆనందం నింపే విధంగా సిఎం జగన్మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారని తెలిపారు. ఇది ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారని తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయాంలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప పేదల అభివృద్ధి కోసం చేసిందేమీ లేదన్నారు. చంద్రబాబు, పవన్ మాటలను ప్రజలెవరూ నమ్మొద్దని కోరారు.

గరుగుబిల్లి : గరుగుబిల్లిలో సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి, నాయకులు రౌతు రామినాయుడు, బి.వెంకటాపురంలో సర్పంచ్ బొత్స లక్ష్మి, ఖడ్గవలస జంక్షన్లో వైసిపి నాయకులు అంబటి గౌరునాయుడు వైఎస్ఆర్ విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తెర్లి ఎల్లంనాయుడు, నల్ల శ్రీరాములునాయుడు, ముగిది సింహాచలంనాయుడు, చింతల మల్లినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : పట్టణంలోని కార్గిల్ జంక్షన్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే వి.కళావతి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ రాశేఖరరెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. అన్ని వర్గాలకు అండగా నిలిచిన వ్యక్తన్నారు. అటువంటి సుపరిపాలన మరలా వైఎస్ తనయుడు జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్, నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, వైసిపి యువనాయకులు గువ్వల రమేష్‌బాబు, వైస్ చైర్మన్లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాపరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు వెలమల మన్మథరావు, వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాష్ తదితరులున్నారు. అంతకు ముందు రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఆస్పత్రి రోడ్డు నుంచి కార్గిల్ పాయింట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంఎల్ఎ, ఎంఎల్‌సి, రమేష్‌బాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

పార్వతీపురంటౌన్.. మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, చిత్రంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర

సీతానగరం : మండలంలో పెదబోగిలి జంక్షన్లో వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు బి.శ్రీరాములునాయుడు, బి.చిట్టిరాజు, ఆర్‌వి పార్థసారథి, ఎంపిటిసి ఎస్.గౌరీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం.బాబ్జీ, నాయకులు ఎస్.రామారావు, ఎం.మాధవరావు, ఉపసర్పంచ్ కె.అరవింద్ కుమార్ పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు, గర్భిణులకు, బాలింతలకు మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని పండ్లు, రొట్టెలు, ఒఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, సర్పంచ్ జి.సుజాత, వైస్ సర్పంచ్ షేక్ ఆదిల్, మాజీ ఎంపిపి ఐ.ఇంద్రకుమారి, ఎంపిటిసిలు వి.బంగారనాయుడు, టివిఎస్ స్వామియోజులు, మైనార్టీ నాయకులు షేక్ నూరేళ్ల పాల్గొన్నారు.

భామిని : మండలంలోని కొరమ గ్రామ కూడలి వద్ద ఎ.రఘుపతినాయుడు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, వైసిపి సీనియర్ నాయకులు కొవ్వాడ చిరంజీవులు, బొడ్డేపల్లి ప్రసాదరావు, మజ్జి సంజీవ్‌రావు, అలజింగి షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం

సీతంపేట : మండలంలో పాతపనుకువలసలో ఉన్న ఎన్‌జి రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రంలో రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతులకు అధిక దిగుబడులు వచ్చే విత్తనాలను సీనియర్ శాస్త్రవేత్త పి.సీతారాం అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ, పి.సౌజన్య, కె.కాంతారావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి ఆదినారాయణ పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఎంసి చైర్మన్ మోహన్‌రావు, సర్పంచ్ కళావతి ఆదిలక్ష్మి, ఉప సర్పంచ్ పాలవలస బృందావతి, నాయకులు పాలవలస ప్రకాశ్, కన్వీనర్ సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ, సీతంపేటలో వైఎస్ఆర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, ఎంపిపి ఆదినారాయణ, నాయకులు ; కురుపాం.. రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న మండల, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, షేక్ నిసార్

వైసిపిలో గ్రూపులపోరు!

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ నియోజకవర్గంలో వైసిపిలో గ్రూపుల పోరు మొదలైందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇటీవల జరుగుతున్న పరిణామాలతోపాటు వైఎస్ఆర్ జయంతి సందర్భంగా చోటుచేసుకున్న బల నిరూపణ కార్యక్రమం అందుకు బలాన్నిస్తోంది. పాలకొండ నియోజకవర్గ పరిధిలో పాలకొండ, సీతంపేట, భామిని, వీరఘట్టం మండలాలున్నాయి. గతంలో నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగిరేది. 2014 ఎన్నికల్లో టిడిపి కంచుకోటను ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి బద్దలు కొట్టి వైసిపి జెండా ఎగురవేశారు. 2019లోనూ ఆమె మరోసారి ఘన విజయం సాధించారు. 2014 నుంచి వైసిపికి ఎదురులేని నియోజకవర్గంగా మారింది. పార్టీ కేడర్ కూడా బలంగా ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో నాయకుల మధ్య చిన్నచిన్న విభేదాలు ఉన్నప్పటికీ ఎన్నికల కాలంలో మాత్రం ఏకతాటిపై పనిచేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మాజీ మంత్రి పుష్పశ్రీవాణి సోదరి పాలకొండ నియోజకవర్గంలో ఉన్నారు. శ్రీవాణి సోదరి భర్త గువ్వల రమేష్‌బాబుకు ఈ ప్రాంతంతో మంచి సత్సంబంధాలు ఉన్నాయి. దీంతో శ్రీవాణి సోదరికి టిక్కెట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. ముఖ్యంగా రమేష్‌బాబు సీతంపేట ఏజెన్సీలో కాంట్రాక్టర్‌గా మంచి గుర్తింపు ఉంది. దీంతోపాటు యువకుడు కావడంతో ఎక్కువ మంది ఆకర్షితులవుతున్నారని చర్చించుకుంటున్నారు. ఇప్పటి నుంచే ఎమ్మెల్యే టిక్కెట్ కోసం ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నట్టు సమాచారం. తాజాగా శనివారం వైఎస్ జయంతి వేడుకల్లో ఈ విషయం రుజువైంది. తనకంటూ కేడర్ ఉందని నిరూపించుకోవాలని రమేష్‌బాబు ఒక ప్రయత్నం చేశారన్న చర్చ నడుస్తోంది. ర్యాలీతోపాటు వైఎస్ జయంతి ఉత్సవాలకు ఆయన జనసమీకరణ చేసుకుని హాజరవడంతో ఈ చర్చకు దారితీసింది.

ఎమ్మెల్యే కళావతికి నియోజకవర్గంలో మంచి గుర్తింపు ఉంది. పార్టీలో కూడా ఆమెకు మంచి పేరుంది. ఈ విషయాన్ని ఆ పార్టీ శ్రేణులే చెబుతున్నాయి. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి పార్టీకి విధేయురాలుగా ఉంటున్న ఆమెను కాకుండా వేరే వ్యక్తికి టిక్కెట్ ఇచ్చే అవకాశాలు లేవని ఆ పార్టీలోనే కొంతమంది చర్చించుకుంటున్నారు. కళావతి కూడా నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు.

ఘనంగా విత్తనాల పండగ

విత్తనాలతో వేసిన ముగ్గు సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, తదితరులు

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో రోలుగుడ్డ గ్రామంలో ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో రైతు దినోత్సవం సందర్భంగా శనివారం విత్తన పండగను ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ఆర్ట్స్ సంస్థ ఆదివాసి ప్రాంతాల్లో అనేక అభివృద్ధి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. రైతులు పండించిన పంటకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. విత్తనాల పండగ ద్వారా ఆదివాసీ సంప్రదాయాల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కోరారు. ఆమదాలవలస కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నీలవేణి మాట్లాడుతూ రైతులంతా సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని కోరారు. చిరుధాన్యాల సాగుతో లాభాలు పొందాలన్నారు. ఉద్యానశాఖాధికారి పేడాడ జయశ్రీ మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సింహాచలం, వివిధ సంస్థల ప్రతినిధులు బి.శంకర్రావు, రవీంద్రనాథ్, ఎ.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కులను కాలరాస్తున్న పాలకులు

ప్రజాశక్తి-పాచిపెంట

గిరిజన హక్కులు, చట్టాలను పాలకులు కాలరాస్తున్నారని గిరిజన సంఘం జిల్లా నాయకులు గెమ్మెల జానకిరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం పాచిపెంటలో గిరిజన సంఘం మండల మండల మహాసభను నాయకులు సుకురు అప్పలస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం... వారికి ద్రోహం చేస్తూ బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని చూస్తోందని విమర్శించారు. మరోవైపు నేటికీ గిరిజనులకు రహదారి సౌకర్యాలు లేవన్నారు. కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అదే సందర్భంగా కార్పొరేట్ కంపెనీల కోసం గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును ఆగమేఘాలపై నిర్మిస్తున్నారని మండిపడ్డారు. కుడుమూరు భూములను సాగుచేస్తున్న గిరిజన రైతులకు పట్టాలు మంజూరు చేయాలని, కొండతాడూరు భూములకు హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫారెస్ట్ క్లియరెన్స్ ఇచ్చి రహదారి నిర్మాణం చేపట్టాలన్నారు. గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు మంచాల శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన హక్కుల పరిరక్షణ కోసం ఐక్యపోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం 9 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా గెమ్మెల బాబూరావు, కార్యదర్శిగా జన్ని రామయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని జిమ్మిడివలసలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 68 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు, వృద్ధులకు, చిన్నారులకు ఇళ్ల వద్ద వైద్య పరీక్షలు నిర్వహించామని ఆయన తెలిపారు. అవసరమైన వారందరికీ ఉచితంగా మందులు అందజేశామని చెప్పారు.

గిరిజనులకు వైద్య సేవలు

గుమ్మలక్ష్మీపురం : మండలం లోని వంగర గ్రామంలో రాఫ ఫౌండేషన్, మధుశ్రీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు రవికుమార్ గిరిజనులకు వైద్య సేవలు అందించారు. రోగులకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.దినమయ్య, జెడ్‌పిటిసి ఎం.రాధిక, వైస్ ఎంపిపిలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని మారుమూల ప్రాంతమైన కీసర నుండి డోలుకోన గ్రామానికి రూ.40 లక్షలతో రోడ్డు పనులకు శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. మారుమూల గ్రామాలకు రహదారి లేకపోవడంతో ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి రోడ్లు మంజూరు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. ప్రతి గ్రామంలో విద్య, వైద్యం, తాగునీరు, వైద్య సదుపాయాల మెరుగుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, జెడ్‌పిటిసి ఎం.రాధిక, వైస్ ఎంపిపిలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో పంటలకు మేలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండ గ్రామంలో శనివారం ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, మాస్టర్ ట్రెయినీ జి.నిర్మల సమక్షంలో రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వేసే ప్రతి పంట విత్తనాలను బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకోవడం వల్ల మొలక శాతం పెరుగుతుందన్నారు. హానికర సూక్ష్మజీవుల నుంచి రక్షణ లభిస్తుందని చెప్పారు. దిగుబడికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. వరి, చిరుధాన్యాలు, నూనె గింజలు, తదితర పంటలకు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. వరి విస్తీర్ణం తగ్గించి, శ్రీవరి, రాగి, అపరాలు పంటలు వేసుకోవడం వల్ల రైతులకు అదనపు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం.ప్రభావతి, అడ్డాకుల గంగరాజు, పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్లు లేకుండా చర్యలు

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలో డ్రాపౌట్లు లేకుండా ప్రధానోపాధ్యాయులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంఇఒలు సామల సింహాచలం, కె.శ్రీనివాసరావు సూచించారు. శనివారం జిల్లా విద్యాశాఖ నిర్వహించిన వెబెక్స్ మీటింగ్‌లో మండలంలోని హెచ్‌ఎంలు స్థానిక ఎంఆర్‌సి నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెవికె కిట్లను విద్యార్థులకు పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలన్నారు. నాడు నేడు ఫేజ్-2 పనులను వేగవంతం చేయాలని చెప్పారు. ఈ నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు, ఎంఆర్‌సి సిబ్బంది భద్ర, శారద పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

స్థల వివాదంలో కొట్లాట

ఒకరికి గాయాలు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

స్థల వివాదంలో కొట్లాట జరిగింది. అందులో ఒకరికి గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి పార్వతీపురం మండలంలో చోటుచేసుకుంది. ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నర్సిపురానికి చెందిన మందాడి రాము తన పశువులను కెంగువ సూర్యనారాయణకు గతంలో అమ్మేశాడు. రాము ఇంటి వెనుకున్న ప్రభుత్వ స్థలంలో సూర్యనారాయణ పశు వులను కట్టడానికి వచ్చాడు. తన స్థలంలో పశువులను కట్టడం ఏమిటని రాము ప్రశ్నించగా, సూర్యనారాయణ కర్రతో ఆయన్ను కొట్టాడు. దీంతో రాము గాయపడ్డాడు. స్పందించిన స్థానికులు 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు.

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని డికెపట్నం పంచాయతీ టొంకి గ్రామానికి చెందిన మాదాల పృథ్వీరాజ్ అనే యువకుడు కడుపునొప్పి తాళలేక శనివారం తన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. స్పందించిన తల్లి సీతారత్నం వెంటనే డోకిశీల పిహెచ్‌సికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఇక్కడి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని టీబీ చర్చి వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ నుంచి శుక్రవారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ తరచుగా మరమ్మతులు గురవుతోంది. దీనిపై కనెక్షన్ ఉన్న వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.